

ఓం నమో భగవతే శ్రీరమణాయ



# రమణ భాస్కర

## (అంతర్వేదిలో శ్రీ నాన్నగారి ప్రవచనము, 21-1-98)

**ప్రియమైన ఆత్మబంధువుల్లారా,**

దేహబుద్ధిని అజ్ఞానం అంటారు, ఆత్మబుద్ధిని సుజ్ఞానం అంటారు. దేహబుద్ధి ఉన్నవాడు బంధంలో ఉంటాడు. ఆత్మబుద్ధి ఉన్నవాడు శాశ్వత శాంతిలో ఉంటాడు. నేను ఆత్మను అయితే దేహము నేను అనే బుద్ధి ఎందుకు కలిగింది అని అడుగుతున్నారు. నా స్వరూపం శివుడు అంటున్నారు కదా అయితే నాకు శివబుద్ధి కలగకుండా శవబుద్ధి ఎందుకు కలిగింది. కర్మ ప్రవాహంలో ప్రతీ మనిషికి అనేక తలంపులు వస్తాయి. ఈ దేహము నీవు కాకపోయినా దేహము నేను అనే బుద్ధి నీకు కలగకపోతే నీకు కర్మానుభవం కలుగదు. కర్మానుభవం నీకు కలగటం కోసం దేహము నేను అనే బుద్ధిని నీకు కలుగజేస్తాడు. అదే మాయ అన్నారు. పూర్వజన్మలో మనం చేసిన కర్మనే విధి అన్నారు. ఎవడికైతే ఆత్మబుద్ధి కలిగిందో వాడు విధిలో నుండి వేరుపడతాడు. నేను కర్మను అనుభవిస్తున్నాను అని జ్ఞాని అనుకోడు ఎందుచేతనంటే కర్త అక్కడ లేడు. కాని చూసే వాడికి వాడు కర్మ అనుభవిస్తున్నట్లు అనిపిస్తుంది.

ఎవరు నా నోటిలో మట్టిని కొట్టి నా బ్రతుకు హరించినది ఎవరు అరుణాచలా అన్నారు భగవాన్, ప్రతీ మనిషికి కర్తృత్వ బుద్ధి ఉంటుంది. అక్కడ అది చేసాను, ఇక్కడ ఇది చేసాను అని అనుకొంటూ ఉంటాడు. ఈ దేహంలో ప్రాణం ఉన్నంత కాలము కర్తృత్వ బుద్ధితో బ్రతుకుదాము అని అనుకొంటూ ఉంటే నా కర్తృత్వ బుద్ధిని తీసేసావు ఇది మంచిగా ఉందా అంటున్నారు భగవాన్. అక్కడ అలాచేసాను, ఇక్కడ ఇలా చేసాను అని చెప్పకొందాము అంటే కర్తృత్వ బుద్ధిని తీసేసావు. భోగాలు అనుభవిందాము అంటే భోగాల మీద రక్తిని తీసేసావు. ఇలా చేస్తావు అనుకోలేదు. నా దేహమును, మనస్సును నాకు కాకుండా చేసేసావు. అంటే దేహంలో ఉండగానే దేహం నుండి విడదీసేసావు. మనోకల్పితమైన మూడు అవస్థలనుండి విడదీసి వాటికి ఆధారంగా ఏవస్తువు అయితే ఉందో దానిని తెలియపర్చి ఆవస్తువు యొక్క అనుగ్రహంతో నన్ను అలంకరింపచేసావు. ఇది అంతా నాకు తెలియకుండా చేసావు. నీ కోసం నేను తపస్సులు చేయలేదు. యాగాలు చేయలేదు. ఏమీ చేయకుండానే వస్తువును నాకు ఇచ్చేసావు అన్నారు భగవాన్. దీని అర్థం ఏమిటి అంటే నీకు అర్హత ఉన్నప్పుడు నీ కోరికతో సంబంధం లేకుండానే నీ ప్రయత్నంలో సంబంధం లేకుండానే నీవు అడక్కపోయినా ఈశ్వరుడు నిన్ను అనుగ్రహిస్తాడు అని చెప్పకుండా చెప్పటం. నీకు కర్తృత్వబుద్ధి ఉన్నంత కాలము నేను అది చేసాను, ఇది చేసాను అని చెప్పకోకుండా ఉండలేవు. గౌరవంకోసం, మర్యాదకోసం నోటితో చెప్పకపోయినా

మనస్సులో అది మోస్తూనే ఉంటావు. అది కర్తృత్వ బుద్ధి లక్షణం. నేను కర్తను అనే భావన వాడికి ఉంటుంది. అంతేగాని నాద్వారా ఈశ్వరుడు ఆపని చేయించాడు అనే బుద్ధి వాడికి కలుగదు. వీరగంధము తెచ్చామండి, రాయటానికి సిద్ధంగా ఉన్నాము. రాయించుకోవటానికి సిద్ధంగా ఉన్న వీరులు ఎవరైనా ఉన్నారా అన్నాడు ఒక కవి. అంటే ఎవడైతే ధైర్యవంతుడో, వీరుడో వాడికే ఈగంధం రాస్తాముకాని మాకు రాయండి అని ఎవరైనా వస్తే రాయము అంటున్నాడు ఆకవి. వీరగంధము తెచ్చాము, రాయటానికి సిద్దంగా ఉన్నాము, రాయించుకొనేవారు ఎవరైనా ఉన్నారాఅని. అలాగే అరుణాచలేశ్వరుడు ఏమంటున్నాడు అంటే అనుగ్రహం ఇవ్వటానికి సిద్దంగానే ఉన్నాను దానిని పొందటానికి అర్హత, యోగ్యత మీలో ఎవరికైనా ఉందా అంటున్నాడు.

భక్తిలో కూడా స్వార్ధం ఉంటుంది. స్వార్ధంతో భగవంతుని ప్రార్ధిస్తే మీ కోరికలు నెరవేరుస్తాడు గాని భగవంతుడు మీకు తెలియబడడు. స్వార్ధం లేని భక్తికి భగవదనుగ్రహం వస్తుంది. భగవదనుగ్రహం ఎప్పుడైతే కలిగిందో మీరు అడగకుండానే ఆయన స్వరూపాన్ని మీకు ఇస్తాడు. నీవు వేలాది సంవత్సరాలు కష్టపడి సాధన చేసిన తొలగని వాసనలు ఒక మహాజ్ఞాని సమక్షంలో, మహా గురువు సమక్షంలో, తన కరుణతో, ప్రేమతో ఈ భూమిని తడపటానికి ఏ అవతార పురుషుడు అయితే ఈ భూమి మీదకు వచ్చాడో వాడి సమక్షంలో అణిగిపోతాయి. దేవుడు తనకంటే వేరుగా ఉన్నాడు అనే భావన పోవటం కష్టం. దేవుడు తనకంటే వేరుగా ఉన్నాడు అంటేనే జీవుడికి ఇష్టం ఎందుచేతనంటే వాడిని ప్రార్ధిస్తూ ఉండవచ్చును, కోరకలు అడుగుతూ ఉండవచ్చును. వాడు ఇస్తూ ఉంటాడు. భక్తుడు ఏమనుకొంటాడు అంటే దేవుడు కనిపిస్తే బాగుండును అనుకొంటాడు. భగవంతుడే రూపం ధరించి గురువుగా వచ్చి నీకు మంచి మాటలు బోధిస్తాడు నీకు కనిపించే గురువు, దేవుడు వేరు అనుకోవద్దు. దేవుడే దేహం ధరించి గురువుగా వస్తాడు. మలమూత్రములను లోపల ఉన్నప్పడు బాగానే చూసుకొంటాము. అవి బయటకు వచ్చినప్పడు అసహ్యించుకొంటాము, దూరంగా వెళ్ళిపోతాము. అవి మనవే అయినా వాటిని అసహ్యించుకొంటాము అలాగే గుణాలు మన లోపల ఉన్నప్పడు బాగానే ఉంటాయి. బయటకు వచ్చినప్పడు రోత కలిగిస్తాయి. గురువు లోపల పని చేస్తాడు, బయట పని చేస్తాడు లోపల ఉండి నీ వాసనలను కెలుకుతాడు అప్పడు అవి నీకు కనిపిస్తాయి. ఏ గుణంలో ఏ దోషం ఉందో నీకు తెలియజేసి దాని మీద రోత పుట్టింపజేసి దానిని బయటకు లాగి మంట పెడతాడు లోపల ఉన్న గురువు బయటకు గెంటటానికి చూస్తాడు. బయట ఉన్న గురువు వాటిని నీకు తెలియజేసి నీకు అర్ధమయిన తరువాత వాటిని తొలగిస్తాడు. లోపల గురువు, బయట గురువు ఒక్కటే, ఇద్దరూ ఆత్మే కాని లోపల గురువు లోపల కెలుకుతాడు, బయట గురువు వాటిని బయటకులాగి మంటపెడతాడు. ఇద్దరూ వేరు వేరు పనులు చేస్తూ ఉంటారు. నీకు ఆత్మానుభవం కలిగే వరకూ లోపల గురువు, బయట గురువు పనిచేస్తూనే ఉంటారు. హృదయ స్థానంలోనికి చేరటానికి ఏ గుణాలయితే అడ్డు వస్తున్నాయో వాటిని తొలగించి హృదయ స్థానంలోనికి చేరుకొనే వరకూ సరియైన మార్గంలో నడిపిస్తూ, బోధిస్తూ వస్తువును తెలుసుకొనే వరకూ జన్మ జన్మలకు నిన్ను వెంటాడతాడు వాడు గురువు. ఏ మార్గంలో ప్రయాణిస్తే నీవు ఆత్మానుభవం పొందుతావో దారి తప్పకుండా ఆ

మార్గంలో ప్రయాణించేటట్లు చూస్తాడు. ఒక వేళ నీవు దారి తప్పిన సరిదిద్దుతాడు వాడు గురువు. ఏది ఆత్మ, ఏది దేహం అని తెలియని నీకు జ్ఞానమా ? దేహంచనిపోతుంది, చావులేని వస్తువు ఒకటి నీహృదయంలో ఉంది. దానికి దీనికి ఇసుమంతయు సంబంధం లేదు. నీ అజ్ఞానము వలన చనిపోయే ఈ దేహాన్ని చావులేని వస్తువు అయిన ఆత్మను సమానంగా చూస్తున్నావు. నీకు జ్ఞానమా? నీ లోపల ఉన్న ఈ దోషాలను తెలియజేసి వాటిని బయటలాగి మంట పెడతాడు వాడు గురువు.

గురువు యొక్క లక్షణాలు గురించి అడిగితే సర్వకాల సర్వావస్థలలో తాను ఆత్మతో కలిసి ఉంటాడు, ఆత్మ కంటే తాను వేరు అనే బుద్ధి వాడికి ఉండదు. బయటకు చూస్తే ఆత్మ, లోపలకు చూస్తే ఆత్మ కళ్ళు మూస్తే ఆత్మ, కళ్ళు తెరిస్తే ఆత్మ కళ్ళు మూస్తే తన్ను తాను చూసుకొంటాడు, కళ్ళు తెరిస్తే తననే లోకంలో చూసుకొంటాడు వాడు గురువు. అందరినీ సమానంగా చూస్తాడు మనం ఆయనను పూజించినా పూజించకపోయినా, ఆయన కూడ మనం ఉన్నా లేకపోయినా ఎల్ల వేళలా, అన్ని ప్రదేశములలో, అన్ని పరిస్థితులలో ఆచంచలమైన ధైర్యం కలిగి ఉంటాడు. వాడు సద్గురువు. చాలామంది గురువులు ఉన్నారు, ఏ గురువును ఎంచుకోమంటారు అని అడిగితే నీకు ఎవరి ఉపదేశం నచ్చుతోందో, ఎవరి సమక్షంలో నీకు శాంతి కలుగుతోందో వారిని గురువుగా తీసుకో, ఇతరుల విషయం నీకు అనవసరం. నీవు బాగుపడే విధానం చూసుకో, నిజమైన గురువు ఇలా చెయ్యి అని నోటితో చెప్పడు. నీవు ఏ పనిచేయాలో, ఏది చేయకూడదో ఆ స్ఫురణను నీకు లోపల నుండే ఇస్తాడు. నీ లోపల ఉన్నశాంతి నీకు అందకుండా ఏ గుణాలు అయితే అడ్డు వస్తున్నాయో వాటిని తొలగించుకోవాలి అనే బుద్ధిని బయట నుండి చెప్పకపోయినా లోపల నుండి ఆ బుద్ధిని కలుగజేస్తాడు. వాడే గురువు. నీవు ఆనంద సముద్రంలో ఉండి కూడా దుఃఖపడుతున్నావు. నీవు శాంతి సముద్రంలో ఉండికూడా వేదన, రోధన పడుతున్నావు. ఆనందం, శాంతి నీకు అందకుండా ఏ గుణాలు అడ్డువస్తున్నాయో వాటిని తొలగించుకోవాలనే బుద్ది నీలోపల నుండి కలుగజేస్తాడు వాడు గురువు. ఆగురువు యొక్క ఋణం ఎవరు తీర్చుకోగలరు. నా గురువు ఎవరో నాకు ఎలా తెలుస్తుంది అంటే నీవు నిర్మలంగా ఉండి, ప్రశాంతముగా ఉండి, తదేకంగా ధ్యానం చేస్తూఉంటే నీలోపల ఉన్న అంతర్వాణి నీకు నిర్దేశిస్తుంది నీ గురువు ఎవరో చెపుతుంది. నీలో ఉన్న అజ్ఞానం వలననే నీ స్వరూపం ఏమిటో నీకు తెలియటం లేదు. నీలో ఉన్న అజ్ఞానమును తొలగించి నీ స్వరూపాన్ని నీకు పట్టిఇచ్చేవాడే గురువు.

నా మనస్సు కుదురుగా ఉండటం లేదు అని భగవాన్‌తో చెపితే కుదురుగా లేకపోతే నీకు నష్టం ఏమిటి ? మనస్సు నువ్వు కాదు కదా అది ఎలా ఉంటే నీకు ఎందుకు అన్నారు భగవాన్. పెంట మీద కూర్చొని దుర్వాసనలు వస్తున్నాయి అని అనుకోవటం ఎటువంటిదో మనస్సు చుట్టూ తిరుగుతూ అది కుదురుగా లేదు అని అనుకోవటం అటువంటిదే. గురువు ప్రేమస్వరూపుడు అంటున్నారు గురువుకు నా మీద ప్రేమ ఉంది అని నాకు ఎలా తెలుస్తుంది అని అడుగుతున్నారు. గురువు యొక్క ప్రేమ చెప్పాలంటే అది మనస్సుకు, మాటకు అందదు, మనస్సుకు, మాటకు అతీతమైన దానిని నీకు

ఎలా చెప్పగలను. అది మాటకు, మనస్సుకు అందకపోయినా గురువు యొక్క ప్రేమ అనుభవైక వేద్యము. పంచదార ఎలా ఉంటుంది అంటే తియ్యగా ఉంటుంది. అని చెపుతారు. తీపిదనం ఎలా ఉంటుంది అంటే మనం చెప్పలేము. కాని పంచదార నోటిలో వేసుకొన్న వాడికి ఆస్పర్శ తెలుస్తుంది. అలాగే గురువు యొక్క ప్రేమ అనుభవం లోనికి వచ్చిన తరువాత తెలుస్తుందిగాని అది ఎలా ఉంటుంది అంటే అనుభవంలోనికి వచ్చినవాడు కూడా చెప్పలేడు ఎందుచేతనంటే అది నోటితో చెప్పేదికాదు. మనిషిని మనిషిని, కులాన్ని కులాన్ని, దేశాన్ని దేశాన్ని వేరుచేసేది తలంపు మాత్రమే. మనకు తలంపులు లేకపోతే అందరం సమానంగానే ఉంటాము. తన స్వరూపం అఖండంగా ఉన్నా మానవుడిని వేరుచేసేది తలంపు. ఎక్కడ తలంపులు లేవో, ఎక్కడ ద్వితీయం లేదో అట్టి చైతన్యం లోనికి వెళ్లినప్పడు కదా ప్రకృతిని దాటేది అని కృష్ణుడు గీతలో చెప్పాడు. ఈ ప్రకృతిని దాటిని తరువాత అందరూ సమానమే. అది పరమశాంతి, అది ఆత్మశాంతి, అది అనుభవైకవేద్యం, అది అనుభవంలోనికి వచ్చిన తరువాత దాని గురించి నీకు తెలుస్తుంది.

నీవు ఎన్ని తపస్సులు చేసినా, పూజచేసినా, జపంచేసినా, ధ్యానం చేసినా నీకు చైతన్యానుభవం కలుగకపోతే కోరికలు అణిగి ఉంటాయి కాని కోరికలు పూర్తిగా నశించవు. తత్వం నీకు అనుభంలోనికి వచ్చేవరకూ నిన్ను కోరిక, కోపం, అసూయ ఈ దుర్గుణాలు విడిచిపెట్టవు. చైతన్యానుభవం కలిగేవరకు ఈ ప్రకృతి గుణాల నుండి విడుదల పొందానని చెప్పటానికి వీలులేదు, సాధన విడిచి పెట్టటానికి వీలులేదు. ఎవడైతే ప్రకృతికి అతీతుడో వాడిని తెలుసుకొన్నప్పడు ప్రకృతిగుణాలకు అతీతుడవు అవుతావు. ఈలోపుగా నీ ఇంద్రియాలను నమ్మటానికి అవకాశంలేదు. కోరికలు జయించాము అని అప్పడే అనుకోవద్దు. నీ హృదయంలో ఉన్న వస్తువులో కోరికలు లేవు. దానికి భిన్నంగా ఏదీ లేదు. అది అనుభవంలోనికి వచ్చినప్పడు రాగద్వేషములనుండి,కోరికలు నుండి విడుదల పొందుతావుగాని అది అనుభవంలోనికి రాకుండా వాటిలో నుండి విడుదల పొందాను అని అనుకోకు, ప్రమాదంలో పడవద్దు అంటున్నారు.